సాక్షి ప్రకాశం

మంగళవారం | 25 | ఏప్రిల్ | 2023



జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా డీఆర్సీ సమావేశాలు నిర్వహిస్తోంది. నేడు ఏడో సమావేశం జరగనుంది. - 8లో..



ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు

ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో మలేరియా నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ వైద్యాధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పరిస్థితులపై ఆరా తీసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా నివారించడంతో పాటు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యా శాఖ, గనులు, మత్స్యశాఖలు మలేరియా నివారణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయని జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ కలెక్టర్‌కు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా దూపాడు



పురస్కారం అందుకుంటున్న దూపాడు సర్పంచ్ శైలజ

త్రిపురాంతకం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాన్ని మండలంలోని దూపాడు గ్రామ సర్పంచ్ ఎనిబెర శైలజ పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ద్వారా తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎనిబెర శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనకబడిన పశ్చిమ ప్రకాశం నుంచి తమ గ్రామం ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. దీనికి అన్ని విధాలుగా సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సహకారంతోనే గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. పురస్కారం అందుకున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కమిషనర్ సూర్యకుమారిలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి, ప్రజలకు ప్రభుత్వ సేవలందించిన పంచాయతీ కార్యదర్శి వై శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు సుధాకర్‌బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ పంచాయతీగా రాచర్ల ఎంపిక



పురస్కారం అందుకుంటున్న రాచర్ల సర్పంచ్ రాయలమ్మ

రాచర్ల: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా రాచర్ల గ్రామ పంచాయతీ ఎంపికైంది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్య కుమారి అందజేసి ఘన సన్మానించారు. సర్పంచ్ సగినాల రాయలమ్మకు ఎంపీడీవో కె.కవితా చౌదరి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరనాయక్‌తో పాటు మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ముక్కలు... ముక్కలు



ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా తయారైంది జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి. ఎనిమిది నియోజకవర్గాల్లో సైకిల్ ముక్కలు..ముక్కలుగా విడిపోయింది. జిల్లా కేంద్రం ఒంగోలు మొదలు పశ్చిమాన ఉన్న యర్రగొండపాలెం నియోజకవర్గం వరకూ అన్ని ప్రాంతాల్లో గ్రూపు తగాదాలతో సతమతమవుతోంది. పైకి అందరూ కలసినట్టుగా బిల్డప్ ఇస్తున్నా అంతర్గతంగా ఒకరంటే ఒకరికి పడక రగిలిపోతున్నారు. ఆ పార్టీ అధినేత వచ్చి వెళ్లినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కానరాలేదు.

- జిల్లా టీడీపీలో అంతర్గతపోరు
- యర్రగొండపాలెంలో గ్రూప్ తగాదాలు
- ఎస్ఎన్‌పాడు, దర్శిల్లో పార్టీకి నాథుడే కరువు
- దర్శి ఇన్‌చార్జ్ పమిడి రమేష్ పార్టీకి రాజీనామా
- గిద్దలూరులో అధినేత పర్యటన సాక్షిగా కుమ్ములాటలు
- దామచర్ల సోదరుల మధ్య తారస్థాయిలో విభేదాలు
- టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసానికి, దామచర్లకు మధ్య విభేదాలు
- అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినా నేతల మధ్య కుదరని సయోధ్య


సాక్షిప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలోని తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. నూతనంగా ఏర్పాటైన జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిస్థితి టీడీపీ పార్టీ ముక్కలు... ముక్కలుగా విడిపోయింది. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకుల తీరు ఎవరి దారి వారిదే అన్నట్లు తయారైంది. కొన్ని నియోజవర్గాల్లో పార్టీని ముందుకు నడిపే నాయకుడే కరువయ్యాడంటే జిల్లాలో టీడీపీ పరిస్థితి ఎంతదయనీయంగా ఉందో అవగతమవుతుంది. టీడీపీ అధినేత, రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మూడు రోజుల పాటు పర్యటించినా జిల్లా పార్టీలోని నాయకుల మధ్య ఉన్న విభేదాలను సరిదిద్దలేకపోయారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తీవ్రస్థాయిలో ఉన్నా వాటిని చంద్రబాబు సరిదిద్దకపోవడం విచారకరమని సొంత పార్టీ కేడరే నిరుత్సాహం వ్యక్తం చేయడం గమనార్హం. పార్టీలోని నేతలు విడిపోయినా, పార్టీ పరువు గంగలో కలిసిపోతున్నా, చంద్రబాబు పార్టీలో అంతా బాగుంది అన్నట్లు బిల్డప్ ఇస్తూ జిల్లాలో మూడు రోజులు గడిపారు. జిల్లా పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే కొందరు పెత్తందార్లు మిగతా వర్గాల నేతలను విస్మరించటం వల్ల ప్రతి నియోజకవర్గంలో వర్గాల వారీగా పార్టీ చీలిపోయింది.

జిల్లా పర్యటన సందర్భంగా చంద్రబాబు తొలుత గిద్దలూరు నియోజకవర్గంలో అడుగుపెట్టారు. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా నేతల మధ్య విభేదాల ఫలితంగా తొలిరోజు సభ అట్టర్ ఫ్లాప్ అయింది. మూడు ముక్కలుగా విడిపోయి ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుకున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాపై ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు డబ్బు మూటలకు ఆశపడి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పచ్చ కండువా కప్పుకున్న ముత్తుముల అశోక్ రెడ్డిది ఒక గ్రూపు. రెండో గ్రూపు మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకురాలు పిడతల సాయి కల్పనా రెడ్డి. ఇక ముచ్చటగా మూడో గ్రూపు పెట్లల నారాయణ యాదవ్‌ది. చంద్రబాబు వచ్చినప్పుడు పిడతల సాయి కల్పనా రెడ్డి అసలు ఆయనను కలవనే లేదు. అధినేత వస్తుంటే కనీసం సమాచారం ఇవ్వకుండా అవమానించారంటూ పార్టీ నేతలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దామచర్ల జనార్దన్ ఆమెను కలిసేందుకు ప్రయత్నించినా నిరాకరించినట్టు తెలిసింది.

యర్రగొండపాలెంలో అయితే సైకిల్ పార్టీ నాలుగు ముక్కలైంది. సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నే రవీంద్ర వర్గం ప్రధానంగా ఉండగా ఎరిక్షన్ బాబు, పాలపర్తి డేవిడ్ రాజు, గత ఎన్నికల్లో ఓటమి పాలైన బూదాల అజితరావుది మరో గ్రూపుగా ఎవరిదారి వారిదన్నట్లు వ్యవహరిస్తూ పోతున్నారు. పక్క నియోజకవర్గంలో పార్టీ అధినేత స్వయంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటుంటే ఇక్కడ ఎవరికి వారు విడివిడిగా కార్యక్రమాలు చేపట్టడం గమనార్థం. పార్టీలో కుమ్ములాటలు పక్కనపెట్టిన చంద్రబాబు యర్రగొండపాలెంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న దళితులపై వాళ్ల పార్టీ నాయకులు, కార్యకర్తల చేత రాళ్ల దాడి చేయించే పనికి పూనుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. ఇక దర్శి నియోజకవర్గంలో అయితే పార్టీ పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. పార్టీ కేడర్‌కు మార్గం చూపే నాయకుడే కరువయ్యాడు. దర్శి పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న పమిడి రమేష్ ఆ బాధ్యతలకు కొంతకాలంగా దూరంగా ఉంటూ వస్తున్నారు. చివరకు ఇన్‌చార్జ్ పదవికి, పార్టీ సభ్యత్వానికి సైతం సోమవారం రాజీనామా చేయటంతో ఆ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. గతంలో ఆ పార్టీలో ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా చేసిన శిద్దా రాఘవరావు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ తరువాత దర్శి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలైన కదిరి బాబూరావు సైతం పచ్చ జెండాను కిందపడేసి వైఎస్సార్‌సీపీలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో దర్శిలో టీడీపీని ముందుకు నడిపే నాయకుడే కరువయ్యాడు. దీంతో ఇక్కడి పరిస్థితి మరీ దారుణంగా మారింది.

సంతనూతలపాడు నియోజకవర్గంలో కూడా నాయకత్వ లోపం స్పష్టంగా కనపడుతోంది. మాజీ ఎమ్మెల్యే విజయకుమార్‌ను ఆ నియోజకవర్గంలో నాయకుడిగా పార్టీ కేడర్ గుర్తించటం లేదు. ఇక్కడ విజయకుమార్ సరిపోడు అని పార్టీ కేడర్ ఒక నిర్ణయానికి వచ్చారు. అందుబాటులో లేకుండా బయటే ఉంటుండడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి తీరు పట్ల పార్టీలో కేడర్ కొంత గుర్రుగా ఉంది. కొంతమందిని దగ్గరకు తీసి మరికొంతమందిని పూర్తిగా విస్మరిస్తున్నాడన్న నైరాశ్యం కార్యకర్తల్లో నెలకొని ఉంది. కనిగిరి నియోజకవర్గంలో ఉగ్రనరసింహారెడ్డి వన్ మ్యాన్ షో నిర్వహిస్తూ సెకండ్ కేడర్‌ను పట్టించుకోవడంలేదని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బాలినేని దెబ్బకు దామచర్ల విలవిల...

జిల్లా కేంద్రం ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి దెబ్బకు టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విలవిల్లాడుతున్నాడు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాలినేని ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నారు. కరోనా సమయంలో తన సొంత డబ్బులు ఖర్చు చేసిమరీ ప్రజలకు, బాధితులకు సేవలందించారు. అదే సమయంలో దామచర్ల ఒంగోలు ముఖం కూడా చూడకుండా బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో తలదాచుకున్నారు. వరదల సమయంలో కూడా ప్రజల సమస్యలు పట్టించుకున్న పరిస్థితి లేదు. వీటికి తోడు దామచర్ల సోదరుడు సత్యతో విభేదాలు భగ్గుమంటున్నాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో దామచర్ల జనార్దన్‌కు టీడీపీ టిక్కెట్టు కూడా దక్కే పరిస్థితి లేదని ఆ పార్టీలోని నాయకులే చెవులు కొరుక్కుంటున్నారు. బాలినేనిని ఎదుర్కోవాలంటే కొత్త అభ్యర్థి అయితే తప్ప టీడీపీకి వేరే గత్యంతరం లేదన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. అంతేకాదు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన నూకసాని బాలాజీని దామచర్ల పూర్తిగా విస్మరించారన్న ఆరోపణలు ఉన్నాయి. దామచర్ల నిర్వహించే సమావేశాలకు కనీసం నూకసానిని పిలవటం కూడా లేదు. దీంతో నూకసాని పాత గుంటూరు రోడ్డులో నుంచి పార్టీ కార్యాలయాన్ని భాగ్యనగర్ మూడో లైన్‌కు మార్చుకున్నారు. టీడీపీ నాయకులను దామచర్ల భాగ్యనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయానికి కూడా ఎవరూ వెళ్లొవద్దని ఆంక్షలు విధించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో నూకసాని బాలాజీ కార్యాలయం వెలవెలబోతోంది.

ఉన్నత విద్యకు భరోసా

- జగనన్న వసతి దీవెన నిధులు విడుదల రేపు
- జిల్లాలో 48,499 మంది తల్లుల ఖాతాలో నిధులు జమ
- అనంతపురంలో జరిగే కార్యక్రమంలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాకు విడుదల కానున్న రూ.46.72 కోట్లు



ఒంగోలు: రాష్ట్రంలో డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న ఇంజినీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు 2022–23 విద్యా సంవత్సరానికి మొదటి విడత జగనన్న వసతి దీవెన నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న అనంతపురం జిల్లాలో విడుదల చేయనున్నారు. సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు సంబంధిత కాలేజీలలో పాల్గొనేలా సహాయ సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.లక్ష్మానాయక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం బటన్ నొక్కనేగా నిధులు నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలో జమకానున్నాయి. జిల్లాలో 48,499 మంది అర్హులైన విద్యార్థులు ఉండగా, వారి తల్లులు 43,878 మంది బ్యాంకు ఖాతాల్లో నిధులు జమకానున్నాయి. ఇందుకుగాను ప్రభుత్వం రూ.46,72,17,500 విడుదల చేయనుంది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొనడంతోబాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

సంక్షేమశాఖ	విద్యార్థుల సంఖ్య	తల్లుల సంఖ్య	విడుదల చేస్తున్న నిధులు (రూ.)
సాంఘీక సంక్షేమశాఖ	12,341	11,077	11,73,27,500
గిరిజన సంక్షేమ శాఖ	1,086	981	1,03,02,500
బీసీ సంక్షేమశాఖ	16,032	14,544	15,37,80,000
ఇబిసి	12,980	11,783	12,75,60,000
ముస్లిం మైనార్టీ	3,100	2,776	2,95,90,000
కాపు	2,908	2,671	2,81,47,500
క్రిస్టియన్ మైనార్టీ	52	46	5,10,000
మొత్తం	48,499	43,878	46,72,17,500

నియోజకవర్గం వారీగా లబ్ధిపొందనున్న విద్యార్థులు

నియోజకవర్గం	విద్యార్థులు	తల్లులు	జమకానున్న మొత్తం (రూ.)
దర్శి	6,401	5,799	6,20,15,000
గిద్దలూరు	6,389	5,783	6,04,47,500
కనిగిరి	6,276	5,648	6,12,40,000
కొండపి	6,692	5,995	6,49,82,500
మార్కాపురం	5,414	4,895	5,18,25,000
ఒంగోలు	6,715	6,012	6,46,47,500
సంతనూతలపాడు	5,541	4,944	5,33,65,000
యర్రగొండపాలెం	5,071	4,673	4,86,95,000
మొత్తం	48,499	43,749	46,72,17,500

స్పందన అర్జీల పరిష్కారంలో చిత్తశుద్ధి అవసరం



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా ప్రజలు అందచేసిన అర్జీల తాలూకు సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశంచారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ఫోన్ ద్వారా దూర ప్రాంత ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్య తిరిగి రీఓపెన్ కాకుండా ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వర రావు, చెన్నయ్య, వరకుమార్, హెలాషారోన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

- దర్శి మండలం కోటారెడ్డి పాలెంకు చెందిన విజయకుమారి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి మెరిట్ లిస్ట్‌లో ఉన్న తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు.
- తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామానికి చెందిన చిట్టిబాబు జలకళ పథకంలో బోరు వేశారని, అయితే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని కలెక్టర్‌కు తెలిపారు. పరిశీలించి వెంటనే న్యాయం చేయాలని కోరారు.
- యర్రగొండపాలెం మండలం తమ్మాడపల్లి గ్రామానికి చెందిన నారాయణ తనకు సర్వే నంబర్ 791–1లో 2.84 ఎకరాల భూమి ఉందని, అయితే సర్వేకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపాడు. తగిన చర్యలు తీసుకుని సర్వే చేయించి హద్దులు చూపించేలా చూడాలని కోరుతూ అర్జీ అందజేశారు.

సుపరిపాలన కోసమే పంచాయతీరాజ్



పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

- ఉత్తమ సేవలందించిన పంచాయతీ సర్పంచ్‌లకు జ్ఞాపికలు
- స్పందన భవనంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజలకు సుపరిపాలన అందాలనే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్పందన భవనంలో పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి డీపీవో నారాయణ రెడ్డి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డిలు సంయుక్త అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ 1993లో 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు రాజ్యాంగబద్ధం అయ్యాయన్నారు. ఈ బిల్లును 17 రాష్ట్రాల అసెంబ్లీల్లో ఆమోదించారని, అనంతరం ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. మొదటి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని 24 ఏప్రిల్ 2010లో ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది వివిధ అంశాల్లో గ్రామాల్లో సాధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకుని గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. దీంతో జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో గ్రామ పంచాయతీలు పోటీపడి మొత్తం 17 పంచాయతీలు అవార్డులు సాధించాయన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాలోని రాచర్ల గ్రామం, త్రిపురాంతకంలోని దూపాడు గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించి అవార్డులు అందుకున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన వివిధ క్రీడల్లో ఉత్తమ క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనపరిచిన వారికి కలెక్టర్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అవార్డులు పొందిన పంచాయతీలకు ఆయా సర్పంచ్‌లకు, సెక్రటరీలకు, ప్రజలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

వంద శాతం నెరవేరిన నవరత్నాల హామీలు

- జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నవరత్నాల హామీలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వంద శాతం అమలు చేసినట్లు ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఏప్రిల్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిందన్నారు. ఈ సర్వేలో 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలు వారి భవిష్యత్తు, వారి పిల్లలు భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారన్న విషయమై వారి అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారన్నారు. ఈ సర్వే కార్యక్రమానికి సంబంధించిన కీలక అంశాలను మధ్యంతర ఫలితాల నివేదికను వెల్లడిస్తున్నామని బాలినేని పేర్కొన్నారు. మెగా సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలోని తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. మెగా సర్వేలో భాగంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంత వరకు 54,702 కుటుంబాలను సందర్శించామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన వాటిని సందర్శించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 1.65 కోట్ల కుటుంబాలను సందర్శించటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని చెప్పారు. కుల, మత, వర్గ వివక్ష లేకుండా ప్రతిపక్షాలు బలంగా ఉన్నాయని భావించే ప్రాంతాలపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకు ఉన్న నమ్మకం మాటల్లో చెప్పలేనిదన్నారు. ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో చూడగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరి రవిచంద్ర, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, గోలి తిరుపతి రావు, నక్కల లీలా కుమారి, మీరావలి, మోడుబోయిన సురేష్, బేతంశెట్టి హరిబాబు, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సిహెచ్ సత్యనారాయణ రెడ్డి, తాళ్ళపాలెం శ్రీను, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో ఉప దేశరామస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 28, 29వ తేదీల్లో రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 28న ఆరు పండ్లసైజ్ విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు, నాల్గవ, ఐదోవ బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేస్తామన్నారు. 29న సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండోవ, మూడోవ, నాల్గోవ, ఐదోవ బహుమతులు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9849490257, 9963669391 నంబర్లను సంప్రదించాలని కోరారు.

11 మంది జూదరులు అరెస్టు

త్రిపురాంతకం: మండలంలోని పి.అన్నసముద్రం గ్రామ సమీపంలో పొట్టేలు పందేలు ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జీవీ సైదులు సోమవారం తెలిపారు. జూదరుల నుంచి రూ.1.11 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వారు గుంటూరు జిల్లా వినుకొండలో గొర్రెల సంతకు వెళ్తూ మార్గమధ్యంలో అక్కడక్కడా పొట్టేలు పందేలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్సై పేర్కొన్నారు.

ప్రైవేటు ల్యాబ్‌లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: ప్రైవేటు ల్యాబ్‌లు, ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు, సూచనలు తప్పకుండా పాటించాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం జీజీహెచ్‌లోని సమావేశం మందిరంలో ప్రైవేటు హాస్పిటల్స్, ల్యాబ్‌ల యాజమాన్యాలతో నోటిఫైడ్, సంక్రమిత వ్యాధులపై ఐడీఎస్‌పీ, ఐహెచ్ఐపీలపై సమావేశం నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రైవేటు యాజమాన్యాలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులను నిర్దేశించిన పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యాజమాన్యాలకు వివరించారు. దీనిలో జిల్లా డేటా మేనేజర్ ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, ఐడీఎస్‌పీ డేటా ఆపరేటర్ విజయలక్ష్మి, ఐరాడ్ నోడల్ అధికారులు ఆరోగ్యమిత్రలు, టీమ్ లీడర్‌లు పాల్గొన్నారు.

ఇరువురికి కారుణ్య నియామక ఉద్యోగాలు

ఒంగోలు అర్బన్: విధి నిర్వహణలో ఉండి మరణించిన వారి కుటుంబ సభ్యులకు సంబంధించి ఇరువురు కారుణ్య నియామకాల ద్వారా కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అంకితభావంతో ఉద్యోగం చేసి మంచి పేరుతెచ్చుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. నియామకాలు పొందిన వారిలో గంధం సురేంద్రబాబు, జాజుల వెంకటనారాయణ ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

● వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా డీఆర్‌సీ సమావేశాలు
● టీడీపీ జమానాలో డీఆర్‌సీ ఊసే లేదు
● కోవిడ్ కారణంగా కొన్ని సమావేశాలకు బ్రేక్
● ఇప్పటికే 6 డీఆర్‌సీలు.. నేడు ఏడో సమావేశం



ఒంగోలు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ప్రతి జిల్లాలో క్రమం తప్పకుండా డీఆర్‌సీ(జిల్లా అభివృద్ధి సంఘం సమావేశం)లు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికి 6 డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించారు. కోవిడ్ కారణంగా సమావేశాలకు కొంత బ్రేక్ పడినా వీలైనంత వరకు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. వీటిలో చర్చించిన అంశాలు దాదాపుగా పరిష్కారం కాగా కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. డీఆర్‌సీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతుంటారు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఆర్‌సీ సమావేశం ఒక్కటంటే ఒక్కటీ నిర్వహించలేదు. దీన్నిబట్టి గత ప్రభుత్వానికి అభివృద్ధిపై ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

అభివృద్ధే అజెండా..

మంగళవారం నిర్వహిస్తున్న 7వ డీఆర్‌సీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. కాగా, ఈ సమావేశంలో తాగు నీరు, హౌసింగ్, వెలిగొండ ప్రాజెక్టు, వ్యవసాయం-అనుబంధ శాఖలు, ఉపాధి హామీ, విద్య, వైద్యారోగ్యం, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల పురోగతిపై చర్చించనున్నారు. ముఖ్యంగా తాగునీరు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, ప్రజా ఆరోగ్యం, హౌసింగ్ పథకంపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వేసవి నేపథ్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై చర్చించనున్నారు. తాగునీటిపై వచ్చిన గ్రీవెన్స్‌లను పరిశీలించడంతోపాటు పైపు లైన్ లేని ప్రాంతాలు, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రదేశాల్లో నీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు సమాచారం.

☛ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, నిర్వాసితుల సమస్యలపైనా ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.8054.30 కోట్లు కాగా ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.5949.64 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అంతేకాకుండా 11 గ్రామాల్లో భూసేకరణకు సంబంధించి నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

☛ పేదలందరికీ ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా జిల్లాలో ఇప్పటికే 68,681 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 14,447 పూర్తయ్యాయి. 35,492 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగవంతంపై సమీక్షించనున్నారు.

☛ ప్రజారోగ్యానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో జిల్లాలో వైద్యా ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై డీఆర్‌సీలో చర్చించనున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతోపాటు జిల్లాలోని సర్వజన ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డీఆర్‌సీల నిర్వహణ ఇలా..

ఒకటో డీఆర్‌సీ	2019 నవంబర్ 20
2వ డీఆర్‌సీ	2020 జనవరి 29
3వ డీఆర్‌సీ	2020 అక్టోబర్ 15
4వ డీఆర్‌సీ	2021 మే 28
5వ డీఆర్‌సీ	2021సెప్టెంబర్ 15
6వ డీఆర్‌సీ	2022 మే 6

ఉద్యోగాల పేరుతో మోసం

● మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ హితవు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: సోషల్ వెల్ఫేర్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ తిరుపతికి చెందిన ఎం.ప్రదీప్ అనే వ్యక్తి తనను మోసం చేశాడని కొనకనమిట్ల గ్రామానికి చెందిన సీహెచ్ కిరణ్ ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన ఎస్పీని కలిసి తనకు జరిగిన మోసాన్ని వివరించారు. మాయమాటలు చెప్పి తన వద్ద నుంచి రూ.43,700 నగదు తీసుకున్నాడని, ఉద్యోగం ఇప్పించక పోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే పట్టించుకోవడం లేదని వాపోయాడు.

➤ పర్సనల్ లోన్ ఇస్తామంటూ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఒక మెసెజ్‌ను నమ్మి రూ.98,095లకు మోసపోయానని చీమకుర్తికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పి.అశోక్‌కుమార్ అనే వ్యక్తి ఇండియా బుల్స్ అనే సంస్థ ద్వారా లోన్ ఇప్పిస్తున్నానని, లోన్ కోసం ఆటో డెబిట్ చేయాలని నమ్మబలికాడని తెలిపారు. తొలుత రూ.6990 చెల్లించాక ఇన్సూరెన్సు, ఇతర చార్జీల పేరుతో రూ.98 వేలకు పైగా వసూలు చేశాడని, లోన్ గురించి అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని శ్రీనివాస్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మొత్తం 74 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్న చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉద్యోగాలు, లోన్ యాప్‌ల విషయం ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచించారు. తొందరపడి ఎవరికీ నయా పైసా డబ్బులు ఇవ్వవద్దని, ఒకసారి డబ్బులు ఇచ్చాక తిరిగి మన చేతికి రావడం అంత సులువు కాదని హితవు పలికారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, దిశ డీఎస్పీ పల్లపు రాజు, డీఎస్పి డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి గొంతు ఎండిపోయి వ్యక్తి మృతి

ఒంగోలు టౌన్: తప్ప తాగిన మైకంలో రోడ్డు పక్కన పడి ఎండకు గొంతెండి పోయి వ్యక్తి మృతి చెందాడు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఎదుట సాయి ఐటీఏ కళ్యాణ మండపం పక్కన సిమెంట్ చప్టా వద్ద ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులకు అతడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా రాజాపానగాల్ రోడ్డులో నివాసం ఉంటున్న ఆదిమూలం రాఘవాచారి(40)గా గుర్తించారు. మృతుడు వడ్రంగి పనిచేస్తుంటాడని సమాచారం. తాగిన మత్తులో వెనుక్కి పడి ఎండ తీవ్రతకు గొంతు ఎండిపోయి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, తాలుకా సీఐ రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



సెమీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

● ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన సెమీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక పాత గుంటూరు రోడ్డులోని రవి ప్రియ మాల్ పక్కన నూతనంగా నిర్మించిన ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బాలినేని ప్రజలకు అంకితం చేశారు. ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలోని 33/11 ఇండోర్ సబ్‌స్టేషన్ నగరంలో ఇదే మొట్టమొదటిది కావటం విశేషం. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూ.6.50 కోట్లతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ.సత్యన్నారాయణ, నగర మేయర్ గంగాడ సుజాత, రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్, ఈఈలు పి.శ్రీనివాసులు, కట్టా వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి, అంజిరెడ్డి, రమేష్, శివప్రసాదు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నాగులుప్పలపాడు: ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మస్టర్లు, మాన్యువల్‌గా నమోదు చేసిన మస్టర్లకు వ్యత్యాసం ఉండటంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయడంతో పాటు టీఏకు షోకాజు నోటీసు జారీ చేసినట్లు డ్వామా ఏపీడీ వెంకటస్వామి తెలిపారు. ఉప్పుగుండూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలనకు సోమవారం వచ్చిన క్రమంలో క్షేత్రస్థాయిలో కూలీలు పని విధానం, ఆన్‌లైన్‌లో మస్టర్లలో వ్యత్యాసం కనిపించడంతో ఈ అంశాన్ని పీడీ దృష్టికి తీసుకుపోగా వివరాలు పరిశీలించిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్ సాల్మన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు టీఏకు షోకాజు నోటీసులు ఇచ్చినట్లు ఏపీడీ వెంకటస్వామి తెలిపారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు



రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

పెద్దదోర్నాల: భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన సోమవారం మండల పరిధిలోని రోళ్లపెంట, పెద్ద మంతనాల గిరిజన గూడేల మధ్యలో జరిగింది. ఈ సంఘటనతో కర్నూల్, గుంటూరు ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. మండల పరిధిలోని పెద్దమంతనాల, రోళ్లపెంట గిరిజన గూడేల మధ్య ఓ భారీ చెట్టు మొదలు భాగంలో కొన్ని గంటల ముందు నుండే నిప్పు అంటుకుని లోలోపలే తగలబడుతూ ఉంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చెట్టు మొదలు భాగం పూర్తిగా తగలబడటంతో చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలి పోయింది. ఈ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు ప్రయాణించకపోవటతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోవటంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కొందరు వాహనదారులు చెట్టును తొలిగించేందుకు ప్రయత్నించినా కుదరలేదు. సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మండుటెండలో ప్రయాణికుల అవస్థలు

ఘాట్ రోడ్డులో సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో రోడ్డుకిరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మండుటెండలో అధిక ఉష్ణోగ్రతల మధ్య నట్టనడివిలో వాహనాలు నిలిచి పోవటంతో ప్రయాణికులు తీవ్ర యిబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు ప్రయాణికులు వాహనాల్లో ఉండలేక అడవిలో ఉన్న చెట్ల నీడన కొంత మేర సేదతీరినా భానుడి ప్రచండ వీక్షణాలను తట్టుకోలేక అల్లాడి పోయారు. ప్రయాణికుల ఇబ్బందులను ముందే గ్రహించిన ఎస్సై శ్రీనివాసరావు తన వాహనంలో కూల్ కంటైనర్‌లతో నీటిని సంఘటనా స్థలికి తీసుకువెళ్లడంతో ప్రయాణికులలో వృద్ధులు, చిన్న పిల్లలకు కొంత మేర దాహార్తిని తీర్చగలిగారు.

ఆకవీడు ఎస్‌బీఐలో అగ్ని ప్రమాదం

● ఉద్యోగుల అప్రమత్తతతో తప్పిన నష్టం



బ్యాంకులో దట్టమైన పొగ

రాచర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాలు.. బ్యాంకు ఉద్యోగులు విధి నిర్వహణలో ఉండగా, ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూటై దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. వెంటనే అప్రమత్తమైన ఉద్యోగులు అలస్యం చేయకుండా క్యాష్ కౌంటర్‌లోని నగదు, కంప్యూటర్లు తీసుకుని బయటికు పరుగులు తీశారు. బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. ఆస్తి నష్టం కలగలేదని బ్యాంకు మేనేజర్ చెప్పారు.

30 నుంచి మల్లవరం వెంకన్న బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, ఈవో నాగేశ్వరరావు

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈవో దామా నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు 30వ తేదీ అంకురారోహణం చేస్తారని, మే 1న ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆ రోజు సంతానం లేని స్త్రీలకు గరుడ ప్రసాదాన్ని అందిస్తారని తెలిపారు. శేషవాహనంపై స్వామివారిని ఊరేగిస్తారన్నారు. 2వ తేదీ హంసవాహనం, 3వ తేదీ సింహవాహనం, 4వ తేదీ హనుమద్వాహనం, 5వ తేదీ ఉత్సవమూర్తులకు విశేష స్నపన, రాత్రికి మోహినీ ఉత్సవం, గరుడసేవ, 6వ తేదీ గజోత్సవం, 7వ తేదీ ఉదయం పది గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రి రథోత్సవం, 8వ తేదీ అశ్వవాహన సేవ, 9వ తేదీ ధ్వజావరోహణ, పూర్ణాహుతి, 10వ తేదీ చక్ర తీర్థం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. పలువురు భక్తుల విరాళాలతో ఆలయానికి పూర్తిగా రంగులు వేయించి భక్తులకు వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.